క్లుప్తంగా

ఆగస్టు 5లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

దుండిగల్: అర్హులైన రైతులు రైతుబీమాకు ఆగస్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 18 వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన వారు దరఖాస్తు పెట్టుకోవాలని, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.72888 94684లో సంప్రదించవచ్చు.

బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై మేయర్ సమీక్ష

నిజాంపేట్: బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై కార్పొరేటర్లతో మేయర్ సమావేశమయ్యారు. బోనాల ఏర్పాట్లు, అమ్మవారి అలంకరణ, భక్తులకు సదుపాయాలు వంటి విషయాలపై చర్చించారు. కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కాసాని సుధాకర్ ముదిరాజ్, బాలాజీ నాయక్, కో.ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, నాయకులు బొర్ర చందుముదిరాజ్, చంద్రగిరి సతీష్ ఉన్నారు.

కుమ్మరిబస్తీలో భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.9లక్షల నిధులతో కుమ్మరిబస్తీలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీ కమిటీ అధ్యక్షుడు ప్రేమకుమార్ పాల్గొన్నారు.

నామమాత్రపు రుసుంతో ఇళ్లను క్రమబద్ధీకరించాలి

సుభాష్‌నగర్: జీఓ.59 కింద దరఖాస్తున్న చేసుకున్న వారి ఇళ్లను నామమాత్రపు రుసుంతో క్రమబద్ధీకరించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో జీఓ.59 దరఖాస్తుదారుల ఇళ్లను కూల్చడంపై నిరసన చేపట్టారు. అనంతరం బాధితులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ బుచ్చిరెడ్డి, జేకే శేఖర్‌యాదవ్, శ్రీనివాస్, రఘుపతి, వెంకటరమణ, రవి పాల్గొన్నారు.

సావన్ కవాడ్ శోభాయాత్ర

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో రింగ్ బస్తీ మనోకామ్న పూర్ణ హనుమాన్ మందిర్ నుంచి హెచ్ఎంటీ శివాలయం వరకు సావన్ కవాడ్ శోభయాత్ర సోమవారం వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ యాత్రలో బిహార్, యూపీ, ఎంపీ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు 108 కలషాలతో గంగా నీళ్లు రింగ్ బస్తీ నుంచి హెచ్ఎంటీ శివాలయం ఆలయానికి వెళ్లి ఆ నీటితో అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ శోభయాత్రలో కార్పొరేటర్ జగన్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వన మహోత్సవం

నిజాంపేట్: శంషీగూడలోని నారాయణ హైస్కూల్‌లో సోమవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ జోన్ ఏజీఎం వైజయంతి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మానవ జాతి మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని, వాటిని నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మొక్కల ప్రాధాన్యత వివరిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం



అయోధ్యనగర్‌లో గ్రేవ్‌యార్డ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన తెలంగాణ భవన నిర్మాణ కార్మిక యూనియన్, శ్రీ చైతన్య సాగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కుల సంఘాల అభ్యున్నతికి రాష్ట్రం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దళిత బంధు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ పథకాలు ఒక్క తెలంగాణాలో తప్ప దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది తమ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, మారయ్య తదితరులు ఉన్నారు.

బాక్స్‌నాలా నిర్మాణ పనులకు శంకుస్థాపన..

- రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లో రూ.90 లక్షల నిధులతో చేపట్టనున్న బాక్స్ నాలా నిర్మాణ పనులకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. బాక్స్ నాలా ఏర్పాటుతో ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలుగనుందన్నారు. త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరామ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పార్కు పనుల పరిశీలన..

- అయోధ్యనగర్ హిందూ శ్మశానవాటికలో రూ.45 లక్షలతో చేపడుతున్న పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. బోర్‌వెల్, కాంపౌండ్ వాల్, నీటి సంపు పనులు పూర్తయ్యాయని, త్వరలోనే బర్నింగ్ ప్లాట్‌ఫామ్, సిట్టింగ్ గ్యాలరీ, బెంచీలను ఏర్పాటు చేస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈఈ కృష్ణ చైతన్య, ఏఈ సురేందర్ నాయక్, కాలనీ అధ్యక్షుడు ఏసు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించాలి



పీసీబీ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

దుండిగల్: చెరువుపైనే ఆధారపడి జీవిస్తున్న ముదిరాజ్ కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర మాజీ బీజేపీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. గాగిల్లాపూర్‌లోని కోతినార్ చెరువులో రసాయన వ్యర్థాల కారణంగా చేపలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. కాగా సోమవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చీఫ్ ఎన్విరాన్‌మెంటర్ ఇంజినీర్ రఘును కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు.

- ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న గ్రాన్యూల్స్ ఇండియా, విర్కోస్ ఫార్మా పరిశ్రమలు సమీపంలో ఉన్న కోతినార్ చెరువులో వ్యర్థాలను వెదజల్లుతున్నాయని అన్నారు. దీని కారణంగా రూ.10 లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయని తెలిపారు. చేపలపైనే ఆధారపడ్డ 100 ముదిరాజ్ కుటుంబాలకు నష్టం వాటిల్లిందననారు. సదరు పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుని, ముదిరాజ్ కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆకుల విజయ్ సాయి, అనిల్‌కుమార్, నవీన్‌కుమార్, నితీష్ తదితరులు ఉన్నారు.

కాటికాపరి హక్కులను హరిస్తే సహించేది లేదు

జగద్గిరిగుట్ట: మాల, బ్యాగరీ, కాటికాపరి హక్కులను హరిస్తే సహించేది లేదని ఎత్తపు కేశవులు అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట గుబురుగుట్ట శ్మశానవాటిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు ఆత్తపు కేశవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం శ్మశానవాటికలను ప్రైవేటీకరణ చేయడం హేయమైన చర్య అని అన్నారు. కుల వృత్తి మీద జీవనం సాగించే వారిపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. శ్మశానవాటికలను సుందరీకరణ పేరుతో హక్కులను హరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాటికాపరులను హెల్త్ కార్డులు, ఇన్సురెన్సు, చనిపోతే రూ.25వేల దహన సంస్కరణల నిమిత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి కత్తుల దుర్గయ్య, సురెందర్, నాగరాజు, యాదయ్య, పోచయ్య, మోహన్, శ్రీనివాస్, రాజు, లక్ష్మమ్మ, సత్యమ్మ, బీంసేన పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమావేశం



ఓటర్ లిస్ట్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, ఎన్నికల అధికారి

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వెరిఫికేషన్ చేస్తున్న నేపథ్యంలో ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ నేపథ్యంలో అధికంగా ఓటర్లు ఉన్న ఇళ్ల లిస్టును జిల్లా కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు నరసింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి, డీసీ మంగతాయారు, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్ తహసీల్దార్లు సురేందర్, సంజీవరావు, పద్మ, బీఎస్‌ఓలు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహను సందర్శించిన అధికారులు

చింతల్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడను ఆనుకుని నల్లగుట్ట నరసింహస్వామి ఆలయం సమీపంలో ఉన్న రాజీవ్ స్వగృహ సముదాయాన్ని సోమవారం జలమండలి అధికారులు పరిశీలించారు. రాజీవ్ స్వగృహ టవర్స్‌కు నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు జలమండలి అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందుకోసం జలమండలి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ విభాగం అధికారి స్వామి, సీజయం విజయరావు, జీఎం శ్రీధర్‌రెడ్డితో కలిసి గృహాల సముదాయాన్ని పరిశీలించారు. ఇక్కడ నివాసాలకు పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారి వెంట డీజీఎంలు విజయ్, రాజేష్, అప్పలనాయుడు, సెక్షన్ మేనేజర్లు ఉన్నారు.

ఈ నెల కూడా 6కిలోలే..



రాజీవ్ గృహకల్పలోని రేషన్ షాపు

జగద్గిరిగుట్ట: ఎట్టకేలకు రేషన్ షాపులు తెరుచుకున్నాయి. ప్రస్తుతం ఒక యూనిట్‌కి 6కిలోల చొప్పున సరఫరా చేస్తుండగా ఈనెల నుంచి పెరుగుతాయని వినియోగదారులు ఆశించారు. కాని యథావిధిగా ఈనెల కూడా 6 కిలోలే సరఫరా అవ్వడంతో వినియోగదారులు నిరాశలో మునిగారు. ప్రతి నెల 2వ తేదీ నుంచి రేషన్ సరఫరా చేయాల్సి ఉండగా ఈసారి కాస్త ఆలస్యం అయ్యింది. సాంకేతిక కారణాల వల్లనే ఆలస్యం అయ్యిందని సోమవారం నుంచి నిరంతరంగా సరఫరా చేయనున్నట్లు రేషన్ డీలర్లు తెలియజేశారు.

విశ్వకర్మ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన విశ్వకర్మ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: విశ్వకర్మ కమ్యూనిటీ భవన నిర్మాణానికి గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో కొంత స్థలం కేటాయించాలని... వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటుకు సహకరించాలని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బాలబ్రహ్మాచారి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ స్థలం విషయంపై ఎన్ని వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్పొరేటర్ రావుల శేషగిరి సూచన మేరకు స్థానికంగా స్థలాన్ని పరిశీలించామని.. చొరవ తీసుకొని స్థలాన్ని మంజూరు చేసేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాలని ఎమ్మెల్సీని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

బోనాలకు ఆహ్వానం..

అదే విధంగా పలు ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలకు వివిధ అభివృద్ధి పనులకు హాజరుకావాలని ఎమ్మెల్సీ రాజును కలిసి ఆహ్వానించారు. పలు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పన విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ... తప్పకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

మరమ్మతులకు నోచుకోని మ్యాన్‌హోల్ చాంబర్



జగద్గిరిగుట్ట రిజర్వాయర్ సమీపంలో మూత లేకుండా ఉన్న మ్యాన్‌హోల్ చాంబర్

చింతల్: ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జగద్గిరిగుట్ట రిజర్వాయర్ ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న మ్యాన్‌హోల్ చాంబర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. చాంబర్‌పై ఉన్న ఐరన్‌షీట్ తుప్పు పట్టడంతో పాటు దానిపై మూత లేకుండా ఉంచారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వ్యర్థాలు చాంబర్‌లోకి వెళ్లి ఇళ్లకు సరఫరా చేసే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అంతే కాకుండా చాంబర్‌పై మూత లేకపోవడంతో సమీపంలోని ఇళ్ల వాసులు ఎక్కడ తమ చిన్నారులు ప్రమాదవశాత్తులో అందులో పడతారోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొన్నేళ్లుగా చాంబర్లకు మరమ్మతులు చేపట్టకుండా ప్రజారోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్న జలమండలి అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్రను విడనాడి చాంబర్‌కు మూత ఏర్పాటు చేయడంతో పాటు రస్ట్ పట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్రలో భాగంగా సోమవారం ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్, బాపునగర్, శ్రీరామ్‌నగర్, బాల్‌రెడ్డినగర్ లలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్‌గౌడ్, మిద్దెల యాదిరెడ్డి, రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గాగిల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చైతన్యకాలనీ, చర్చి గాగిల్లాపూర్, గాగిల్లాపూర్ చౌరస్తా, సర్వే నం.214 తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, గ్రీన్‌వుడ్ విల్లాస్, డ్రీమ్ వన్ విల్లాస్, గాగిల్లాపూర్, ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో..

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ బాలాజీ వెంచర్, 11కేవీ మల్లంపేట్, 11కేవీ ప్రణీత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

బాచుపల్లి సెక్షన్ పరిధిలోని 11కేవీ మల్లంపేట్, ఏసీ టైర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెయిన్‌బో కాలనీ, ప్రణీత్‌జెన్నీత్, ఇందిరనగర్ ప్రధాన రోడ్డు, బాచుపల్లి సిగ్నల్స్ చౌరస్తాలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శాంతాకుమార్ తెలిపారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కేవీఆర్ ఫంక్షన్‌హాల్ లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివారెడ్డి గోదాం, ఎన్‌సీఎల్ సిమ్మింగ్ పూల్, ప్రజెయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నియామకం

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లికి చెందిన ఆకిన బోయిన కుమార్‌యాదవ్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్ చేతుల మీదుగా నియామక పత్రం అనుకున్నారు. కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం శాయశక్తుల పనిచేసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సాహు యాదవ్‌లు పాల్గొన్నారు.

శాప్ ఫంక్షన్ మోడ్యూల్స్‌పై వర్క్‌షాప్

సుభాష్‌నగర్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎమ్మార్‌సెట్)లో సోమవారం ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ త్రూ ఇన్‌స్పిరేషన్ పేరుతో శాప్ ఫంక్షన్ మోడ్యూల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యావేత్త, కార్పొరేట్ ట్రైనర్ సాహిల్ కోహ్లీ మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నేడు డిజిటల్ మార్కెటింగ్‌ను ప్రభావితం చేస్తోందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎంబీఏ విభాగాధిపతి నవీన్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌తో శాప్ ఆధారిత ఉద్యోగాలు పొందేందుకు విద్యార్థులకు ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో శాప్ హెచ్‌ఆర్‌లో ఉద్యోగవకాశాలపై డాక్టర్ ఎం.రాఘవరెడ్డి, సునీత, డాక్టర్ శాండిల్యలు వివరించగా, పీకో పై డాక్టర్ శివారెడ్డి, దుర్గాభవానీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీజేపీలో చేరికలు

చింతల్: రాష్ట్రంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయని.. ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం రంగసాయినగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి శ్రీశైలంగౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవడంతో పాటు దానిపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎమ్)లో ఓటు ఎలా వేయాలి..? వేసిన ఓటు చెల్లిందా? లేదా అనే సమాచారంతో పాటు తాము వేసిన వారికే ఓటు వెళ్లిందా.. లేదా అనే విషయాన్ని పరిశీలించుకోవచ్చని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ ద్వారా ఇక్కడకు వచ్చే ప్రతి ఓటరు అవగాహనకు సంబంధించి ఈవీఎంలో డెమో కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి చంద్రావతి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హాజరు శాతం తక్కువ ఉందని.. పరీక్షకు అనుమతించలేదని

కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

దుండిగల్: హాజరు శాతం తక్కువగా ఉందన్న సాకుతో తమను పరీక్షా కేంద్రంలోకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. దుండిగల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఐఏఆర్ఈ) కళాశాలలో సోమవారం నుంచి ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఫైనల్ ఎగ్జామ్స్ ప్రారంభమయ్యాయి. అయితే హాజరు సుమారు 40 మంది విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. తమను పరిక్ష రాయనివ్వలేదని.. ఒక సంవత్సరం వృథా కావడంతో పాటు తమ భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. అయితే కళాశాల యాజమాన్యం మాత్రం.. 60 శాతానికి పైగా అటెంటెన్స్ పర్సంటేజీ ఉండాలన్నారు. కానీ కొందరి విద్యార్థుల హాజరు శాతం 30లోపే ఉండడంతో జేఎన్‌టీయూ యూనివర్సిటీ వారిని డీటెయిన్ చేసిందని... తమ చేతుల్లో ఏం లేదన్నారు. జేఎన్‌టీయూ ఆధార్ బేస్డ్ బయోమెట్రిక్ ద్వారా రోజు వారి వేలిముద్రలను తీసుకుని అటెండెన్స్‌ను పరిశీలిస్తారని.. తక్కువ ఉన్న వారిని గుర్తించి డిటైన్డ్ చేసిందని.. తమ కళాశాలకు దీంతో ఎలాంటి సంబంధం లేదని తెలిపింది.

అదుపుతప్పి పర్మిట్‌రూమ్‌లోకి దూసుకెళ్లిన కంటైనర్

- త్రుటిలో తప్పించుకున్న ఐదుగురు
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రాణాలతో బయట పడ్డ వైన్స్‌లో పని చేసే రాజు



వైన్స్ పర్మిట్ రూమ్‌లోని దూసుకెళ్లిన కంటైనర్..

సుభాష్‌నగర్: ఇనుప లోడుతో కంపెనీలోకి వస్తున్న కంటైనర్ అదుపుతప్పి వైన్స్‌లోకి దూసుకెళ్లిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధి జీడిమెట్ల డిపో వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే (ఏపీ 27 వి 7209) కంటైనర్ సోమవారం 5.30 గంటలకు శంషాబాద్ కొత్తూరు నుంచి ఇనుపరాడ్లతో జీడిమెట్ల డిపో ఎదురుగా ఉన్న ఎస్ఐవీఎస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వచ్చింది.

- రోడ్డు కంటే ఏడు ఫీట్ల ఎత్తులో ఉన్న కంపెనీలోకి కంటైనర్ వాహనం తోలుతున్న క్రమంలో ఒక్కసారిగా వెనక్కి వెళ్లిపోయింది. వెనకాల ఉన్న వైన్స్ పర్మిట్ రూమ్‌లోకి దూసుకెళ్లింది. అక్కడ ఉన్న ఐదు మంది వ్యక్తులు త్రుటిలో తప్పించుకున్నారు. పక్కనే ఉన్న హై టెన్షన్ స్తంభానికి దగ్గర నుంచి వెళ్తూ కంటైనర్ ఆగిపోయింది. ఒకవేళ హై టెన్షన్ స్తంభాన్ని ఢీకొడితే భారీ ప్రాణ నష్టం జరిగి ఉండేది.



హైటెన్షన్ స్తంభాలకు దగ్గరగా..

- విషయం తెలుసుకున్న సూరారం పోలీసులు అక్కడ చేరుకొని పరిస్థితి సమక్షించారు. గతంలో కూడా ఇదేవిధంగా ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదర్ స్టీల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంటైనర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కంపెనీ ఎదుట ఆందోళనకు దిగిన స్థానికులు

డ్రైనేజీ.. జర దేఖోజీ!



డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, రాజీవ్ గృహకల్ప ప్రధాన రహదారులలో నిత్యం పొంగుతున్న డ్రైనేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు, వాహనాదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సివస్తోంది. ఎటువంటి జబ్బులు రాకముందే వీలైనంత తొందరగా సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. – జగద్గిరిగుట్ట